
సాక్షి
పల్నాడు
సోమవారం । 24 । జూలై । 2023



అంబేడ్కర్ భవన స్థల పరిశీలన

నరసరావుపేట: నరసరావుపేటలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల సేకరణ కోసం కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం పరిశీలించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు.



మహంకాళీ అమ్మవారికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులోని మహంకాళీ దేవస్థానానికి గుంటూరుకు చెందిన ఎంవీఆర్ఎం శ్రీనివాస్, నాగమల్లేశ్వరి దంపతులు రూ.1,11,111 అందజేశారు.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌లో ఈ-హాస్పిటల్



గుంటూరు మెడికల్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా గుంటూరు జీజీహెచ్‌లో ఈ-హాస్పిటల్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం అవుట్ పేషెంట్ విభాగం(ఓపీ)లో రోగుల పేర్ల నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ-హాస్పిటల్ అమలుకు తాత్కాలికంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని, వీరి పనితీరు పర్యవేక్షణకు పరిపాలనా అధికారినీ నియమించామని వివరించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పూర్తిగా అన్ని ఓపీ రిజిస్ట్రేషన్లు ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సమీన బేగం, ఈ హాస్పిటల్ జిల్లా కో- ఆర్డినేటర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణలో మొసలి కలకలం



కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామంలో మొసలి కలకలం రేపింది. ఆదివారం కొమ్మమూరు కాలువలో నుంచి ఒక మొసలి గట్టు సమీపంలో సంచరించినట్లు గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, గ్రామస్తులు కారంచేడు ఎస్‌ఐ ఆర్.శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్‌ఐ చీరాల రేంజ్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదేశాలతో ముగ్గురు సిబ్బంది స్వర్ణ గ్రామానికి వచ్చి పరిసరాలను పరిశీలించారు. కాలువ సమీపంలో ఒక గేదెకు అయిన తీవ్ర గాయాలను బట్టి చూస్తే మొసలి దాడి చేసి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది వచ్చి అవసరమైతే రెస్క్యూ టీం సహకారంతో గాలింపు చేస్తామని, గ్రామస్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

నేడూ డీఎడ్ కౌన్సెలింగ్



డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సుభాని

యడ్లపాడు: డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు ప్రవేశాలకు సంబంధించి సోమవారం కూడా కౌన్సెలింగ్ జరుగుతుందని ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్ కళాశాల) ప్రిన్సిపాల్ ఎస్.ఎం.సుభాని తెలిపారు. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ వాస్తవానికి శనివారంతో పూర్తికావాల్సి ఉందని, అయితే సోమవారం కూడా ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు వివరించారు. బోయపాలెంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండేళ్ల డీఎడ్ కోర్సుకు మొత్తం 150 సీట్లు ఉన్నాయని, తొలిదశలో 88 మందిని ఎంపిక చేశామని వెల్లడించారు. వీరిలో 49 మంది కౌన్సెలింగ్‌కు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకుని అడ్మిట్ కార్డులను పొందారని పేర్కొన్నారు. డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహణకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ ప్రక్రియను డైట్ లెక్చరర్స్ పి.పోలేరు, వి.సుధా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు.

26న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు



తిరువూరు: ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు ఈ నెల 26న విజయవాడలో జరుగుతుందని సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్లో ఆదివారం ఈ సదస్సు ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు వివరించారు. జిల్లాలోని ఉద్యోగులందరూ సదస్సుకు హాజరు కావాలని కోరారు. యూనియన్ నాయకులు కమల, ఎస్వీ భద్రం, అంజయ్య, సర్వేశ్వరరావు, మల్లికార్జున్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కంటిపాపల్లె కాచే..

ఎన్నో ఏళ్ల నుంచి పడుతున్న వేదన ఒక్కసారిగా మటుమాయమైతే.. సుదీర్ఘకాలం నుంచి ఉన్న ఇబ్బందులకు ఇట్టే పరిష్కారం దొరికితే.. ఎక్కడో మహానగరాల్లో కొలువు దీరిన వసతులు ముంగిళ్లలోకే వస్తే.. గుండె లోతుల్లో నుంచి భావోద్వేగం పొంగుకొస్తుంది. బాష్పాల రూపంలో ఆనందం కట్టలు తెగుతుంది.. దేవుడే దిగి వచ్చినట్టు.. హృదయం కృతజ్ఞతా భావంతో ఉప్పొంగుతుంది. సరిగ్గా ఇలాంటి దృశ్యమే విలేజ్ క్లినిక్‌ల ఆవిర్భావంతో ఇప్పుడు పల్లెల్లో ఆవిష్కృతమవుతోంది. అధునాతన వైద్యం తలుపుతడుతుంటే పేద మోములు మెరు'పల్లె' మెరుస్తున్నాయి. సంక్షేమ సర్కారు కంటిపా'పల్లె' కాపాడుతుంటే ఇంటింటా ఆరోగ్యసిరులు కురుస్తున్నాయి. విప్లవాత్మక మార్పులు కళ్లెదుటే కనిపిస్తుంటే జనం గుండెలు జయహో అంటూ నినదిస్తున్నాయి.



ఆరోగ్యభాగ్యం : యడ్లపాడు మండలం లింగారావుపాలెంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

ఊళ్లోనే అధునాతన వైద్యం



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈయన పేరు మద్దు శ్రీనివాసరావు. లింగారావు పాలెం ఎస్సీ కాలనీలో సైకిల్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. 2005లో రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయారు. 17 ఏళ్ల కిందట షుగర్ వచ్చింది. గతంలో ఐదు కిలోమీటర్ల దూరంలోని యడ్లపాడు పీహెచ్‌సీకి వెళ్లాలంటే రోజంతా పట్టేది. షాపు మూసుకోవాల్సిన దుస్థితి. పైగా వ్యయప్రయాసలు. దీంతో రెండు నెలలకోసారి వెళ్లేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఊళ్లోనే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటైంది. ఇప్పుడు వారంలో రెండుసార్లు క్లినిక్‌కు వెళ్లి అర గంటలో పరీక్ష చేయించుకుని మందులు తెచ్చుకుంటున్నారు. దీనివల్ల వ్యయప్రయాసలు తప్పాయని శ్రీనివాసరావు ఆనందంగా చెబుతున్నారు.

గ్రామీణ ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో సత్ఫలితాలు
- స్థానికంగానే అధునాతన పరీక్షలు
- నెలకు రెండుసార్లు వైద్యుల సందర్శన
- దిగ్విజయంగా 'ఫ్యామిలీ డాక్టర్'

యడ్లపాడు: వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ప్రతి రెండువేల జనాభాకు ఓ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్(వీహెచ్‌సీ) ఏర్పాటు చేసింది. వెల్‌నెస్ సెంటర్లుగా పిలుస్తున్న ఈ కేంద్రాలకు వందశాతం ఉపాధి నిధులతో పక్కా భవనాలను నిర్మించింది. ఒక్కో కేంద్రానికి రూ.17.50 లక్షలు వెచ్చించింది. జిల్లాలో ఏర్పాటైన 361 హెల్త్ క్లినిక్‌లలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చొరవతో అధికారులు అత్యాధునిక వసతులు సమకూర్చారు. వైద్య సిబ్బందిని నియమించారు. మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.

మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లదే కీలకపాత్ర

ఈ క్లినిక్‌లో వైద్య సేవలు అందించేందుకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీ)ను ప్రభుత్వం నియమించింది. వీరు ప్రాథమిక చికిత్సతో పాటు రోగి అవసరాన్ని బట్టి కేటాయించిన ప్రభుత్వ వైద్యుని సూచన మేరకు రోగనిర్ధారణ చేసి చికిత్స అందిస్తున్నారు. క్లినిక్‌లో ఓపీ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. రోగికి మెరుగైన వైద్యం అవసరమైతే పెద్దాస్పత్రికి తరలిస్తున్నారు. సాధారణ అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారికి క్లినిక్‌లోనే వైద్య పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. మందులూ ఉచితంగా ఇస్తున్నారు. అవసరమైతే ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులోకి వచ్చి వైద్య సలహాలు అందిస్తున్నారు.



ఇంటింటికీ ఆరోగ్యసిరి : ఇంటికే వెళ్లి రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

పల్నాడు జిల్లాలో ఇలా..	
మండలాలు	: 28
గ్రామీణ జనాభా	: 15,00787
విలేజ్ క్లినిక్‌లు	: 361
ఇప్పటివరకు ఓపీ నమోదు	: 8,11,766

క్లినిక్‌లో 14 రకాల పరీక్షలు

పల్నాడు జిల్లాలో 28 మండలాలు ఉండగా 361 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఒక్కో క్లినిక్‌లో 14 రకాల పరీక్షలు, 12 రకాల వైద్య సేవలు, 105 రకాల మందులు నిత్యం అందుబాటులో ఉంటాయి. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు నెలలో రెండు సార్లు 104 వాహనాల్లో ఈ క్లినిక్‌లకు వచ్చి రోగులను పరీక్షిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాల్లో మంచాలకే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కో క్లినిక్‌లో రోజుకు సగటున 40 నుంచి 50 మధ్య ఓపీ నమోదు అవుతోంది. సరాసరి 10 పరీక్షలు జరుగుతున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. 'ఈ-సంజీవని' పేరుతో టెలి కన్సల్టేషన్ కూడా అందుబాటులో ఉంది.

ఇంటికొచ్చి వైద్యం అందిస్తున్నారు



ఈ ఏడాది ఫిబ్రవరిలో నాకు గుండె బైపాస్ సర్జరీ జరిగింది. అప్పటి నుంచి ఎంఎల్‌హెచ్‌పీ నేరుగా ఇంటికొచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో ఆర్‌ఎంపీలపై ఆధార పడేవాళ్లం. వారు వీలుంటే వస్తారు లేకుంటే లేదు. అప్పుడు 12 కిలోమీటర్ల దూరంలోని చిలకలూరిపేట, లేదా 30 కిలోమీటర్ల దూరంలోని గుంటూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఇంట్లో మగవాళ్లు లేకుంటే ఎంతటి ఇబ్బంది వచ్చినా వారు వచ్చే వరకు బాధతో నిరీక్షించాల్సి వచ్చేది. విలేజ్ క్లినిక్ ఏర్పాటుతో ఇప్పుడు ఆ సమస్యలన్నీ తీరిపోయాయి. స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతోంది. జగన్ సార్ నిండునూరేళ్లు చల్లగా ఉండాలి.

– గోపాళం సత్యవతి, లింగారావుపాలెం

మెరుగైన వైద్యమే లక్ష్యం



పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. అందుకే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతోపాటు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం విలేజ్ క్లినిక్‌లలో మెరుగైన సేవలు అందుతున్నాయి. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దిగ్విజయంగా సాగుతోంది.

– శోభారాణి, పల్నాడు జిల్లా వైద్యాధికారి

ఎన్‌సీడీ ఓపీ వైద్యసేవలు ఇలా..

రోగం	చికిత్స పొందిన వారి సంఖ్య
బీపీ	53,803
షుగర్	53,474
ఓరల్ క్యాన్సర్	38,750
రొమ్ము క్యాన్సర్	1,874
సర్వేకల్ క్యాన్సర్	1,876
మొత్తం	1,49,777



ఆనందాల వేడుక.. ప్రగతి ని'వేదిక' : వెంకటపాలెంలో ముస్తాబైన బహిరంగ సభ వేదిక

పేదింటి పండగ

వరాల రేడు వస్తున్నట్టు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుందో ఏమో.. ఉత్సాహం ఉరకలెత్తుతోంది. పేదింటికి మంచి ఘడియ రాబోతున్నట్టు మంగళాద్రి వేదంలా ఘోషిస్తుందో ఏమో.. శాసన రాజధాని సంతోషగానం చేస్తోంది. 'ఇంటి'వేల్పు కరుణించినట్టు మోడల్ హౌస్ మురిసిపోతుందో ఏమో.. కోటి ఆశలతో కృష్ణాయపాలెం నిరీక్షిస్తోంది. కొంగొత్త కలలతో జననేతకు స్వాగతం.. సుస్వాగతం.. అంటూ ఆహ్వానం పలుకుతోంది.

శాసన రాజధానిలో సంబరం

- నేడు కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యహస్తాల మీదుగా కార్యక్రమం
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు

మంగళగిరి: మండలంలోని కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా శంకుస్థాపన చేయనున్నారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలతోపాటు మంగళగిరి నియోజకవర్గం పెదకాకాని మండలంలోని మొత్తం 53 వేల మంది పేదలకు ప్రభుత్వం ఇక్కడ ఇళ్లస్థలాలు ఇచ్చి పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన జరగనుంది. దీనికోసం కృష్ణాయపాలెంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు లబ్ధిదారులు, స్థానిక ప్రజలు వేయి కళ్లతో నిరీక్షిస్తున్నారు. ఫలితంగా పండగ వాతావరణం నెలకొంది. ఇక్కడ 53 వేల మందికి ఇళ్ల నిర్మాణం పూర్తయితే కొత్తగా 25 ఊళ్లు ఆవిర్భవించనున్నాయి. దాదాపు 2.50 లక్షల మంది జనాభాకు ఆవాసం కానున్నాయి.

బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

తాడికొండ: పేదల ఇళ్లకు శంకుస్థాపన అనంతరం తుళ్లూరు మండలం వెంకటపాలెం తిరుమల తిరుపతి ఆలయం సాక్షిగా జరగనున్న బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు జరిగాయి. ఈ పనులను పలువురు నాయకులు, అధికారులు ఆదివారం పరిశీలించారు. సీఎం కార్యక్రమాల కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త కత్తెర సురేష్‌తోపాటు అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సభా వేదిక, గ్యాలరీ, సందర్శకులు, వీఐపీ, మీడియా పాయింట్ పనులపై సూచనలుచేశారు. బందోబస్తు కోసం భారీగా పోలీసులు తరలివచ్చారు.



పర్యవేక్షణ : ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి సురేష్, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్

పరిశీలించిన మంత్రులు

బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం మంత్రులు ఆదిమూలపు సురేష్, విడదల రజిని, జోగి రమేష్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి కూడా పరిశీలించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. మంగళగిరి మండలం కృష్ణాయపాలెం లేఅవుట్‌లో ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్న పైలాన్, మోడల్ హౌస్‌ను పరిశీలించి సూచనలు ఇచ్చారు. మొక్కలు నాటే పనుల ఏర్పాట్లు, హెలీ ప్యాడ్ పనులనూ పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజ్వరల్లకుండా పకడ్బందీ చర్యలు

- ఇంటింటా సర్వేతో జ్వరాలు వెలుగులోకి..
- గడగపగడపకు వెళ్తున్న వలంటీర్లు, ఆరోగ్యసిబ్బంది
- ఐదులక్షల కుటుంబాల వివరాలు సేకరణ

జిల్లాలో ఇలా..	
మొత్తం ఇళ్లు	: 6,90,000
ఇప్పటివరకు సర్వే పూర్తయినవి	: 5,00,000
నమోదైన డెంగీ కేసులు	: 24
మలేరియా జ్వర పీడితులు	: 4



పట్టణంలోని వరవకట్టలో రక్తనమూనాలు సేకరిస్తున్న వలంటీర్, ఆరోగ్యసిబ్బంది

నరసరావుపేట: వర్షాకాలం నేపథ్యంలో విష జ్వరాలు ప్రజ్వరిల్లకుండా ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెడుతోంది. దీనిలోభాగంగా ఈనెల పదో తేదీ నుంచి జర్వపీడితులను గుర్తించేందుకు ప్రత్యేక ఫీవర్ సర్వే చేపట్టింది. వలంటీర్లు, ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిపై ఆరా తీస్తున్నారు. వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లాలో 6.90 లక్షల కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 5 లక్షల కుటుంబాల వివరాల సేకరణ పూర్తయింది. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సర్వేలో వలంటీర్లనూ భాగస్వాములను చేశారు. వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లకు ఆరోగ్యసిబ్బందిని తీసుకెళ్లి సర్వే చేపడుతున్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఏఎన్‌ఎం హెల్త్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆ సమాచారం అందుకున్న ఏఎన్‌ఎం జ్వర లక్షణాల ఆధారంగా ర్యాపిడ్ డయాగ్నస్టిక్(ఆర్‌డీటీ) పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు డెంగీ లక్షణాలతో బాధపడుతున్న 24 మందితోపాటు నలుగురు మలేరియా పీడితులను గుర్తించారు. వీరికి చికిత్స ప్రారంభించారు.

డెంగీ ఎలీశా పరీక్షలో నిర్ధారణ కావాలి

సర్వేలో డెంగీ లక్షణాలు గుర్తిస్తే ఆ రక్తనమూనాలను ఎలీశా పరీక్ష కోసం నరసరావుపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లోని ఏకైక సెంటినల్ సర్వైలెన్స్ (ఎస్ఎస్‌హెచ్) ల్యాబ్‌కు పంపించి పరీక్ష చేస్తున్నారు. అక్కడ పాజిటివ్‌గా నిర్ధారిస్తేనే డెంగీ కేసు నమోదైనట్టు. ప్రస్తుతం డెంగీ లక్షణాలతో బాధపడుతున్న రోగుల నమూనాలను పరీక్షించగా డెంగీగా వైద్యాధికారులు నిర్ధారించారు.

ప్రజల సహకారం అవసరం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ఇంటింటి సర్వే చేపట్టారు. దోమల నిర్మూలన చర్యలూ చేపట్టారు. దీనికి ప్రజా సహకారం కూడా అవసరం. ఇళ్లలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీటి నిల్వలను తొలగించుకోవాలి. ఆరోగ్యసిబ్బంది సూచనలు పాటించాలి.

– కె.రవీంద్ర రత్నాకర్, జిల్లా మలేరియా అధికారి

దోమల నిర్మూలనకూ చర్యలు

ఆరోగ్యసిబ్బంది విష జ్వరాలకు కారణమైన దోమల నిర్మూలనకూ చర్యలు చేపడుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సహాయంతో ఇళ్లవద్ద యాంటి లార్వా ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. దోమలను నిర్మూలించేందుకు ప్రతి ఇంటిలో పైరత్రాన్ మందును కిరోసిన్‌తో కలిపి స్ప్రే చేస్తున్నారు. మొలాతియాన్ మందును డీజిల్‌లో కలిపి పరిసరాల్లో ఫాగింగ్ చేస్తున్నారు. ఫ్రైడే డ్రైడే యాప్‌తోపాటు వెక్టార్ కంట్రోల్ హైజీన్‌యాప్‌లో ఈ వివరాలు ఏఎన్‌ఎంలు నమోదు చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి నిర్వహించిన ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, శ్రీ చక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, శాంతి కల్యాణం, చండీహోమాల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సర్వ దర్శనానికి గంట సమయం పట్టగా, రూ.100, రూ.300, రూ.500 టికెట్ల దర్శనానికి అర్ధగంట సమయం పట్టింది. మరో వైపున ఉదయం 11–40 గంటలకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి మహా నివేదన అనంతరం 12–20 గంటలకు అన్ని దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మరో వైపున వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా ఉండటంతో భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం వరకు గడిపారు. దర్శనం అనంతరం భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఇక సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. లోక కళ్యాణార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ జరిగింది. రాజగోపురం సమీపంలో సూర్య భగవానుడికి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు, సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించారు.

పేదలకే అసైన్డ్ భూములు పంపిణీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



కార్యాలయంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

నరసరావుపేట: రాష్ట్రంలో అసైన్డ్ భూముల కోసం పోరాడుతున్న పేదలందరికీ వెంటనే వాటిని పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25లక్షల ఎకరాల అసైన్డ్ భూమి ఉందని కోనేరు రంగారావు కమిటీ తేల్చినా ఇప్పటివరకు కాంగ్రెస్, టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలు పంపిణీ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వంతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వారి బంధువులకు అవి అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. పల్నాడు జిల్లాలో కొన్ని వేల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. యడవల్లి భూముల్ని లాక్కునేందుకు ప్రయత్నం జరగ్గా పేదలు పోరాడి దక్కించుకున్నారని చెప్పారు. ఇప్పటికే పేదల సాగులో ఉన్న రెండు లక్షల ఎకరాల భూముల్ని వారికే పంపిణీ చేయాలని, లేని పక్షంలో వారే జెండాలు పాతి స్వాధీనం చేసుకుంటారని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న ఐదు లక్షలమంది పేద కుటుంబాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. రాజధానిలో పని కల్పిస్తేనే అక్కడ పేద ప్రజలు నివాసం ఉంటారని పేర్కొన్నారు. భూ సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సూచించారు. పెత్తందార్ల చేతిలో ఉన్న దేవదాయ భూములు కూడా అన్యాక్రాంతం కాకుండా పేదలకే లీజుకు ఇవ్వాలని ఆయన కోరారు. కౌలు రైతులకే కార్డులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అటవీ శాఖ అనుమతులు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున వెంటనే వరికెపుడిశెల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించి, పల్నాడు జిల్లా అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పాల్గొన్నారు.

కన్నా వస్తాద్ కాదు.. బిచ్చగాడు !

మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా



సత్తెనపల్లి: '' కేంద్రీయ విద్యాలయానికి సత్తెనపల్లి రోడ్ల మీద బిచ్చమెత్తుతాను అని కన్నా అనడం ఏమిటి? టీడీపీ కార్యకర్తల్లారా.. కన్నా వస్తాద్ కాదు.. బిచ్చగాడు. జోలిపట్టి డబ్బులు అడుగుతాడంట'' అని మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రూ.34 కోట్లతో కేంద్రీయ విద్యాలయం నిర్మాణం జరిగితే, దానికి 500 మీటర్ల రోడ్డుకు అంబటి రాంబాబు కృషి చేయట్లేదని ఆరోపణపై కన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీకి చెందిన పచ్చల నాగేశ్వరరావు, కేంద్రీయ విద్యాలయానికి చెందిన పేరెంట్స్ కమిటీతో వచ్చి తనకు మెమొరాండం ఇచ్చాడని, అప్పుడే కలెక్టర్‌తో మాట్లాడి రూ.40 లక్షలు మంజూరు చేయించానని మంత్రి వెల్లడించారు. ఇంత బ్రహ్మాండంగా స్పందిస్తే బురద చల్లడం ఏమిటి కన్నా లక్ష్మీనారాయణ? అని మండిపడ్డారు. కేంద్రీయ విద్యాలయం పక్కనే ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలకు రూ.20 లక్షలు మంజూరు చేయించానని, అసలు ఆ కేంద్రీయ విద్యాలయం ఇంకా ప్రారంభమే కాలేదన్నారు. అది ప్రారంభం అయ్యే నాటికి రోడ్డు ప్రారంభిస్తామని తెలిపారు.తన మీద బురద చల్లి లబ్ధి పొందాలని కన్నా ప్రయత్నిస్తున్నాడని మంత్రి అంబటి ధ్వజమెత్తారు. సత్తెనపల్లిలో గంజాయి అమ్మే పరిస్థితి లేదని తనకున్న సమాచారమని, దీనిపై టీడీపీ నాయకులకు ఏమైనా సమాచారం ఉంటే పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వాలని ఆయన సూచించారు. తాను గంజాయి, దొంగ సారా అమ్మకాల్ని ఎట్టి పరిస్థితిల్లో సహించనని నియోజకవర్గంలో ప్రతి పౌరుడికీ, టీడీపీ నేతలకు తెల్పుతున్నానన్నారు. టీడీపీ కౌన్సిలర్‌ను గంజాయి తాగి తోశారని ఆరోపించారని, అలా చేస్తే పోలీసులకు ఎందుకు కంప్లైంట్ ఇవ్వలేదని ప్రశ్నించారు. దానికి కారణం పోలీసు వ్యవస్థ మీద బురద చల్లాలని, ఇక్కడున్న డీఎస్పీ అవినీతిలేని వ్యక్తి, ముక్కుసూటిగా వ్యవహరిస్తాడని మంత్రి వివరించారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, డీఎస్పీకి ఉందన్నారు. కుటుంబ తగాదాలో వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులపై పోలీసులు కేసులు పెట్టారని, ఆ కేసులో సహాయం చేయమని దూదేకే అనే తమ పార్టీ వ్యక్తి కోరారన్నారు. చేయనని చెప్పానని, ఇటీవల ఒక కుటుంబంలో తగాదాలు ముగ్గురిని బలిగొన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరు తప్పు చేసినా ఉక్కుపాదంతో అణచి వేయడం ప్రభుత్వ ఉద్దేశం, తన ఉద్దేశం కూడా అని వివరించారు. ఏ పార్టీ వాళ్లపైనా పోలీసులు అన్యాయంగా కేసు పెట్టలేదని చెప్పారు. ఒకవేళ టీడీపీలో దూదేకే చేరితే చేర్చుకో తప్పా.. సందు దొరికిందని విమర్శలు చేయవద్దని కన్నాకు హితవు పలికారు. అక్రమ కేసులు పెట్టాల్సిన అవసరం లేదని, పోలీసు వ్యవస్థను గుమస్తాలుగా వాడుకోవాల్సిన దుర్బుద్ధి తనకు లేదని చెప్పారు. అలాంటి పోలీసులు కూడా ఎవ్వరూ లేరని, మాజీ మంత్రి అయిన కన్నాకు ఈగో సమస్య వచ్చిందని ఎద్దేవా చేశారు. డీఎస్పీ మాట వినడం లేదని పోలీసు వ్యవస్థను డీమోరల్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. చంద్రబాబును, రాయపాటిని కమ్మవారని బూతులు తిట్టిన కన్నాకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇవ్వొచ్చునని తెలిపారు. తాను ఘాటు విమర్శలు చేస్తాను తప్పా ఎప్పుడు బూతులు తిట్టనన్నారు. తన గురించి మాట్లాడే నైతిక అర్హత కన్నాకు లేదని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించనని, రౌడీయిజాన్ని సత్తెనపల్లిలో ఉపేక్షించమని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

మాచవరం : బాలికపై లైంగిక దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు. మాచవరం ఎస్సీ కాలనీకి చెందిన బాలికకి అదే గ్రామానికి చెందిన యువకుడు ఈ నెల 21 మాయమాటలు చెప్పి, బలవంతంగా ఆటోలో ఊరి శివారులోని పొలాల్లోకి తీసుకెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలిక తల్లిదండ్రులు గ్రామంలో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో ఆరా తీశారు.అదే గ్రామానికి చెందిన యువకుడు ఆటోలో తీసుకెళ్లాడని తెలుసుకున్నారు. తర్వాత బాలిక ఇంటికి వచ్చి తనపై అత్యాచారం జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు యువకుడిపై అత్యాచారంతో పాటు, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంఘసంస్కర్త రామనాథంబాబు మృతి

కారంచేడు: ప్రముఖ సంఘసంస్కర్త గోరంట్ల రామనాథంబాబు(89) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. చీరాల కోర్టులో కొంతకాలం లాయర్‌గా ప్రాక్టీసు చేశారు. బళ్లారి, కర్ణాటక ప్రాంతాల్లో వ్యవసాయం చేశారు. కారంచేడుతో పాటు, వీరన్నపాలేంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామంలోని సిద్ధార్థ వృద్ధాశ్రమం నిర్వహించారు. 'రంగుల రేఖలు' అనే పుస్తకాన్ని రచించారు. ఆయన భార్య లక్ష్మీదేవమ్మ ఇటీవల మృతి చెందారు. కుమారుడు వెంకటరమణ జపాన్‌లో స్థిరపడ్డారు. అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆడ శిశువు జీజీహెచ్‌కు తరలింపునకు చర్యలు



వైద్యశాలలో ఆడ శిశువును పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారిణి అనూరాధ తదితరులు

వినుకొండ టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలోని మూత్రశాలలో శనివారం రాత్రి వదిలేసిన ఆడ శిశువును అక్కడి సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఐసీడీఎస్ అధికారిణి అనూరాధ ఆదివారం అక్కడకు చేరుకుని శిశువును గుంటూరు జీజీహెచ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శిశువును సోమవారం తరలిస్తామని, తల్లిని గుర్తించేందుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయించినట్లు తెలిపారు. ఆమె వెంట అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ప్రతిభావంతుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నరసరావుపేట: ఇంటర్మీడియేట్‌లో ప్రతిభ చూపిన 200మంది విద్యార్థినీ, విద్యార్థులకు సంక్షేమ హాస్టళ్లలో వసతి కల్పించి ఉన్నత చదువులు చదువుకునేందుకు, ఎంసెట్‌కు హాజరయ్యేందుకు శిక్షణ ఇప్పించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ గల 100మంది బాలికలు, మరో 100మంది బాలురను గుర్తించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్, ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి, పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులది కీలక పాత్ర

విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు



ప్రధానోపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సంచాలకులు వీ.ఎస్.సుబ్బారావు

బాపట్ల అర్బన్: ఉపాధ్యాయులకు సరైన దిశానిర్దేశం చేస్తూ, నాయకత్వ లక్షణాల్ని అలవర్చుకోవాలని విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వీఎస్ సుబ్బారావు తెలిపారు. బాపట్లలోని విస్తరణ శిక్షణ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా(సీమ్యాట్) ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా చిత్తశుద్ధితో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు కచ్చితంగా సాధించవచ్చని చెప్పారు. విద్యార్థుల్ని ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో ఉపాధ్యాయులు పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి వీరభద్రరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ పాల్గొన్నారు.

విత్తన దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

రూ.16.38 లక్షల విలువైన విత్తన అమ్మకాల నిలిపివేత

కారెంపూడి: జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఐ. మురళి ఆధ్వర్యంలోని విజిలెన్స్ టీమ్ శనివారం అర్ధరాత్రి కారెంపూడిలోని కర్షక సీడ్స్ షాప్‌లో తనిఖీలు నిర్వహించింది. ప్రిన్సిపల్ సర్టిఫికెట్స్ (పీసీ) లేని రూ.16.38 లక్షల మిర్చి విత్తనాల అమ్మకాల్ని నిలుపుదల చేసింది. ఈ షాపులో మిర్చి విత్తనాలు కొని ఈపూరు మండలం చిట్టాపురం వీరభద్ర నర్సరీలో నారు పోశామని, అవి సరిగా మొలవలేదని ముగ్గురు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నర్సరీలో విత్తన బెడ్లను పరిశీలించామని, అక్కడ ఆర్మూర్ రకం నకిలీ విత్తన ప్యాకెట్లు రెండు లభ్యం కావడంతో కర్షక్ సీడ్స్‌లో ఆకస్మిక తనిఖీలు చేశామని డీఏఓ మురళి తెలిపారు. అయితే, షాపులో నకిలీ విత్తన ప్యాకెట్లు లభ్యం కాలేదని, షాపు యజమాని పీసీ, లాట్ నంబరుతో రైతులకు బిల్లులు ఇచ్చారని చెప్పారు. ఆ నకిలీ ప్యాకెట్లు ఎక్కడ నుంచి వచ్చాయనే దానిపై సమగ్ర విచారణ చేయాలని పిడుగురాళ్ల ఏడీఏ, కారెంపూడి ఏఓలను ఆదేశించారు. అదే షాపులో పీసీలు లేని రూ.16.38 లక్షల విలువైన ఆరు రకాల మిర్చి విత్తనాల స్టాకును గుర్తించినట్లు చెప్పారు. దీంతో షాపు యజమానిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని డీఏఓ ఆదేశించారు. కంపెనీ నుంచి పీసీలు సమర్పించే వరకు ఆ విత్తనాల విక్రయాల్ని నిలుపుదల చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టడానికి జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో విజిలెన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. రేట్లు ఎక్కువ అమ్మినా, నాణ్యత లేకున్నా, బిల్లులు ఇవ్వకపోయినా రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందినా వెంటనే విజిలెన్స్ టీమ్‌లు రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకుంటాయని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. తనిఖీలలో కారెంపూడి ఏఓ బి. యలమందారెడ్డి, నర్సరావుపేట ఏఓ వి. నరేంద్రబాబు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో నకిలీ విత్తనాల్ని నియంత్రించాలి

ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నరసరావుపేట: జిల్లాలో నకిలీ విత్తనాలు కట్టడి చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈపూరు, కారంపూడి మండలాల్లో వెలుగు చూసిన నకిలీ విత్తనాల మూలాలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లైసెన్స్‌లు లేకుండా అనేక నర్సరీలలో గుర్తింపు లేని విత్తనాలతో మిరపనారు పెంచి, అక్రమంగా రైతులకు అంటగడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ శాఖ ఆధీనంలో ఉన్న ఆర్‌బీకేల ద్వారా అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలని కోరారు. రైతులంతా అనేక ప్రాంతాల్లో మిర్చి విత్తనాలు 10 గ్రాముల ప్యాకెట్ రూ. వెయ్యి నుంచి రూ.2వేలు వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. జిల్లాకు సరిపడా మిర్చి, వరి, కంది, పత్తి విత్తనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ విజిలెన్స్ విభాగం నిర్లక్ష్యం కారణంగానే నకిలీ విత్తనాలు పెరిగిపోయాయని ఆరోపించారు. వ్యవసాయానికి ప్రాథమిక అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్ని సకాలంలో సరఫరా చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్టు

వేటపాలెం: అంతర్రాష్ట్ర గంజాయి విక్రయాల కేసుల్లో ముగ్గురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 15వ తేదీన గంజాయి విక్రయిస్తున్న 26 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. అయితే, మొత్తం 31 మందికి గానూ అప్పట్లో ఐదుగురు పరారీలో ఉన్నట్లు వివరించారు. పరారీలో ఉన్న ఐదుగురులో ముగ్గురిని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం గ్రామానికి చెందిన బాలాజీ గోవిందు ఏ- 1గా, అదే జిల్లా సారియ గ్రామానికి చెందిన బి. సింహాచలం ఏ-4గా, అనకాపల్లి జిల్లా, రోలుగుంట మండలం పాపంపేట గ్రామానికి చెందిన రాజన దర్గహరి ప్రసాద్ ఏ-1గా ఉన్నారన్నారు. ముగ్గురిని మార్టూరులో అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మరి కొంతమంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు ఒడిశా రాష్ట్రంలో రైతుల వద్ద అధిక మొత్తంలో గంజాయి కొని దాన్ని ఇతరులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని చెప్పారు. ప్రధాన నిందితులు ఇద్దరు స్కూటర్‌లో గంజాయితో 22వ తేదీన మార్టూరులోని బిళ్లా ప్రకాష్ ఇంటి వద్దకు రాగా నిఘా ఉంచి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 22 కిలోల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

బంగారం, వెండి చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కమలాకర్

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో ఆదివారం తెల్లవారుజామున ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ కె. కమలాకర్ అందించిన వివరాలు.. స్థానిక నాగరాజుపల్లి రోడ్డులో నివాసం ఉండే షేక్ సలాం శనివారం రాత్రి ఇంటిపై భాగంలో పడుకున్నారు. తెల్లవారుజామున కిందకు దిగి వచ్చిన సలాం తన ఇంటి తాళం పగులగొట్టి సామాన్లు చిందరవందరగా పడవేసి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించారు. బీరువాలో ఉన్న 76 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.5 వేల అపహరణకు గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.2.35 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. సలాం ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్ వీవర్ ఆత్మహత్య



ఒడ్డుకు కొట్టుకువచ్చిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై జనార్దన్, సిబ్బంది

చీరాల టౌన్: సముద్రంలో మునిగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈపురుపాలెం ఎస్‌ఐ జనార్దన్ అందించిన వివరాలు.. పేరాల జక్కావారి వీధికి చెందిన జి. శివనాగేశ్వరరావు(59) మాస్టర్ వీవర్. నాలుగేళ్ల క్రితం గుండె సంబంధిత వ్యాధి కారణంగా శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అయితే, గత కొంతకాలంగా మానసిక సమస్యలతో పాటుగా పలురకాల ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఉదయాన్నే ఆటోలో వాడరేవుకు చేరుకుని ఓ ప్రైవేటు అతిథి గృహం సమీపంలో సముద్రంలో మునిగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపటికి మృతదేహం ఒడ్డుకు కొట్టుకురావడంతో స్థానిక మత్స్యకారుల సహాయంతో ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సెల్‌ఫోన్, ఆధార్‌కార్డును కవర్‌లో పెట్టుకుని భద్రంగా దాచుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె విజయవాడలో, కుమారుడు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జనార్దన్ వివరించారు.

స్థానచలనం పొందిన టీచర్లకు వేతనాలు చెల్లించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన బదిలీలు, ఉద్యోగోన్నతులతో స్థానచలనం పొందిన ఉపాధ్యాయులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న డిమాండ్ చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఎస్టీయూ ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు అధ్యక్షత నిర్వహించారు. తిమ్మన మాట్లాడుతూ బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన 60వేల మంది ఉపాధ్యాయులకు జూన్ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీతాలు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆగస్టు మొదటి వారంలో అన్ని జిల్లాల ఖజానా కార్యాలయాలను ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. ఎస్టీయూ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ మండల విద్యాధికారుల విధులకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని, ఇద్దరు ఎంఈఓల మధ్య అధికారాలు, విధులు సరి సమానంగా విభజన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, సుభాని, అంబరీషుడు, కె. జోజప్ప, పెదబాబు చంద్రజిత్ యాదవ్, మహిళా కార్యదర్శి ఉమ పాల్గొన్నారు.

జిల్లా మహిళా దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

వేటపాలెం: జిల్లా మహిళా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం మండల పరిధిలోని రామన్నపేట శివారులోని కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో జిల్లా మహిళా జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పృథ్వీ అరుణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చల్లా అనూరాధ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యర్ర శివ నాగమల్లేశ్వరి, పేరిశెట్ల పద్మజ, వైస్ ప్రెసిడెంట్‌గా పిచ్చుక సునీత, కర్ణ నిర్మల, సజ్జా రాజ్యలక్ష్మి, కార్యదర్శులుగా పింజల ప్రసన్నలక్ష్మి, బుద్ధి దుర్గా మల్లేశ్వరి, బొడ్డు ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా మాచర్ల ఉషా, దేవన భారతి, పింజల శారదాంబ, బూసం అనూరాధ, ట్రెజరర్‌గా జాగా బత్తుని పద్మ, యన్నం భానుమతి, ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, ఏపీ దేవాంగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, ఏపీ మహిళా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సజ్జా హేమలత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన్నెముద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంక్ జీఎం శేషభానురావుకు నివాళి



శేషభానురావు చిత్రపటం వద్ద నివాళులర్పించిన చైర్మన్ రాతంశెట్టి, ఉద్యోగులు

తెనాలి: హైదరాబాద్‌లో ఈ నెల 11న మృతిచెందిన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జనరల్ మేనేజర్ పిన్నక శేషభానురావు సంస్మరణను ఆదివారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జిల్లా చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము) హాజరయ్యారు. శేషభానురావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బ్రాంచ్ జనరల్ మేనేజరుగా బ్యాంకు ఉన్నతికి, రైతుల శ్రేయస్సుకు పాలకవర్గం చేస్తున్న కృషికి శేషభానురావు సంపూర్ణ సహకారం అందించినట్టు చెప్పారు. బ్యాంక్ పర్సన్‌లు నల్లపాటి రామయ్య, గోవిందనాయక్, వెలిశెల ఏడుకొండలు, కోట హరిబాబు, వట్టికొండ కోటేశ్వరమ్మ, పీటా వెంకటేశ్వరరావు, కె.శివనవీన్, నాబార్డ్ డీడీఎం జి.శరత్‌బాబు, ఆప్కాబ్ జీఎం, ఓఎస్‌డీ ప్రత్తిపాటి రమేష్, బ్యాంక్ సీఈవో టి.కృష్ణవేణి, మాజీ సీఈవో డీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆ బ్యాంక్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కఠారి హరీష్‌కుమార్, ఏపీసీబీఐఏ ప్రధాన కార్యదర్శి కె.బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు నిరుద్యోగులకు జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోసిల్ లిమిటెడ్, ఫ్లిప్‌కార్ట్, మాస్టర్ మైండ్స్, హెల్త్‌కేర్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం టెన్త్, ఆపైన విద్యార్హతలు కలిగి, 18నుంచి 45ఏళ్ల లోపు వయసున్న నిరుద్యోగులు మంగళవారం గుజ్జనగుండ్లలోని డీమార్ట్ ఎదుట ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను వెంట తెచ్చుకోవాలని, ఇతర వివరాలకు తమ ప్రతినిధి పి.మణిదీప్‌ను 8074607278 నంబర్లో సంప్రదించాలని ఆయన కోరారు.